క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాజేడు : మండలంలో బుధవారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేశారు.మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. అలాగే చంద్రుపట్ల క్రాస్ రోడ్డు వద్ద పేరూరు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేశారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుడడంతో నగదు తరలింపులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

ఏటూరునాగారం : మండలంలోని బూటారం గ్రామం వద్ద విద్యుత్ వైర్ తెగిపడడంతో ఎక్కెల గ్రామానికి చెందిన చల్ల దేవరాజ్‌కు చెందిన గొర్రె అక్కడికక్కడే మృత్యువాత పడింది. మేతకు వెళ్లిన గొర్రె రాకపోవడంతో వాటిని వెతుక్కుంటూ వెళ్లగా బూటారం సమీపంలో పొలంలో మృతి చెంది ఉందని బాధిత రైతు దేవరాజ్ తెలిపాడు. రూ.10వేల వరకు నష్టం వాటిల్లిందని, పరిహారం ఇప్పించాలని వేడుకున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్‌ను గెలిపించాలి

కాళేశ్వరం : బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీమెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం కాళేశ్వరంలో ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



లీలా(ఫైల్)

గణపురం : మండలకేంద్రానికి చెందిన మామిండ్ల లీలా(56) బుధవారం గణపసముద్రం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై మచ్చ సాంబమూర్తి కథనం ప్రకారం లీలా కొన్నేళ్లుగా మతిస్థిమితం కోల్పోయిందని, అనేక సార్లు ఆత్మహత్య చేసుకుంటానని గణపసముద్రం చెరువు వద్దకు వెళ్లేదని చెప్పారు. స్థానికులు గమనించి ఆమెను ఇంటి వద్దకు తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించే వారన్నారు. ఈ క్రమంలో బుధవారం చెరువులో వద్దకి వెళ్లి ఆత్మహత్య చేసుకుందన్నారు. భర్త మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

● ఆస్పత్రికి తరలించిన పోలీసులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరిలో మహిళ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా పోచంపల్లి గ్రామానికి చెందిన బజ్జూరు రామక్క(35) బుధవారం ఉదయం కాళేశ్వరం వద్ద గోదావరిలో పురుగులు మందు తాగి కొట్టుమిట్టాడుతోంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కాళేశ్వరం ఎస్సై భవానిసేన్, ఏఎస్సై రాజేశం, కానిస్టేబుల్ రమేశ్ ఘటన స్థలానికి చేరుకొని 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. దీంతో గోదావరి నుంచి తీరానికి ఎడ్లబండి ద్వారా ఆమెను హుటాహుటినా పోలీసులు తరలించారు. 108లో మహదేవపూర్‌కు, అక్కడి నుంచి భూపాలపల్లి ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతోందని ఎస్సై భవానిసేన్ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు చేరుకున్నారు. ఆత్మహత్యయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

నిబంధనలు పాటించాలి



భూపాలపల్లి అర్బన్ : ఈనెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎలక్షన్ నిబంధనలు పాటించాలని భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అనుసరించి తమ తమ పార్టీ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని కోడ్ అతిక్రమించి ప్రవర్తించొద్దని ఆయా పార్టీల నాయకులకు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

గొందిగూడెం.. గొంతెండుతోంది



శ్మశానవాటిక చేతిపంపు వద్ద నీటిని పట్టుకుంటున్న గిరిజనులు



నర్సింహసాగర్ చెరువు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

● తాగునీరులేక అల్లాడుతున్న ఆదివాసీలు
● శ్మశాన వాటిక చేతి పంపే దిక్కు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు

మంగపేట : ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కానీ అడవి బిడ్డల తలరాత మారడం లేదు.. కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వారు అక్కరకు వస్తున్నారే తప్ప.. వారి అవసరాలు.. అవస్థలు పట్టించుకోనే నాథుడే కరువయ్యారు. మండలంలోని నర్సింహసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొందిగూడెంలో తాగేందుకు గుక్కెడు నీరు లేక ఆదివాసీ గిరిజనులు అల్లాడుతున్నారు. నెల రోజుల నుంచి కనీస అవసరాలు తీర్చుకునేందుకు నీరు లేక అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని అధికారులపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గొందిగూడెంలో 30కి పైగా కుటుంబాలు, దాదాపు 100 మంది ఆదివాసీలు నివసిస్తున్నారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన బావిలో చుక్కనీరు లేక ఎండిపోయింది. అయితే గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసిన వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే తాగునీరు వస్తాయని అది కూడా మూడు బిందెల కంటే ఎక్కువ రాదన్నారు. దీంతో తాము గ్రామానికి చుట్టు పక్కల ఉన్న వ్యవసాయ పొలాల్లోని బోరుబావుల వద్ద నీటిని పట్టుకుని తాగునీటికి, నిత్యవసరాలను తీర్చుకున్నామని వాపోయారు. ప్రస్తుతం వరి పంట కోతలు అయిపోవడంతో రైతులు బోరుబావుల బంద్ చేశారని, నెల రోజుల నుంచి తమకు నీటి కష్టాలు మొదలయ్యాని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము తప్పని పరిస్థితిలో గ్రామానికి సమీపంలోని శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన చేతిపంపు వద్ద నీటితో కనీస అవరాలు తీర్చుకుంటున్నామన్నారు. అందులో నుంచి మురికి నీరు వస్తోందని తెలిపారు. సమీపంలోని చెరువు నీటిని తాగు నీటికి వినియోగించాల్సిన దుస్థితి నెలకొందని ఆదివాసీ ప్రజలు గోడు వెల్ల బోసుకుంటున్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య ఎక్కడ తలెత్తవద్దని అవసరమైతే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆదేశించినా గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడితే అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపతున్నారు. తమ సమస్యను సంబంధిత పంచాయతీ అధికారులకు చెప్పినా వినిపించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు సంబంధిత జిల్లా అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి



అభివాదం చేస్తున్న పోరిక బలరాం నాయక్, సీపీఎం నాయకులు

● ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించండి
● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

గోవిందరావుపేట : మతోన్మాదం, కార్పొరేట్ విధానాలతో దేశ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీని ఓడించి లౌకిక శక్తులను పార్లమెంట్‌కు పంపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య కోరారు. బుధవారం మండల పరిధిలోని పస్రాలో గల చెన్నారెడ్డి ఫంక్షన్ హాల్‌లో తుమ్మల వెంకట్‌రెడ్డి అధ్యక్షతన సీపీఎం బలపరిచిన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా వీరయ్య హాజరై మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదని ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ కార్పొరేట్లకు దోచిపెట్టిందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బీజేపీ అవినీతికి పాల్పడిందని అన్నారు. 2017లో మోదీ పార్లమెంట్ సాక్షిగా కనీస మద్దతు ధర హామీ ఇచ్చి అమలు చేయకుండా రైతులను మోసం చేశారన్నారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీ అమలు చేయలేదని విమర్శించారు. బీజేపీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీలను, ప్రజాసంఘాలను నిర్బంధిస్తుందని, ప్రశ్నించే వారిపై క్రూరమైన చట్టాలను ప్రయోగిస్తోందన్నారు.ఈడీ, సీబీఐ, ఈసీ, ఐటీ లాంటి చట్టబద్ధ సంస్థలను తన రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించి, వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని, రైతులకు మద్దతు ధర చెల్లిస్తామన్నారు. రైతులకు సాగు నీరు అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రత్నం రాజేందర్, బీరెడ్డి సాంబశివ, కాంగ్రెస్ పార్లమెంట్ సమన్వయ కర్త అనిల్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, సీపీఎం నాయకులు గ్యానం వాసు, కొప్పుల రఘుపతి, పొదిల్ల చిట్టిబాబు, ఎండీ దావుద్, తీగల ఆగిరెడ్డి, కుమ్మరి శ్రీను, గఫుర్, రాజేష్, చిన్న, చిరంజీవి, ఐలయ్య, సుధాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న నాగవెల్లి



చల్లబాండువాతో వెళ్తున్న యాదవులు

ములుగు : బీరన్న కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆరోరోజు బుధవారం వేడుకలను యాదవులు ఘనంగా నిర్వహించారు. నాగవెల్లి పట్నం వేసి అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు. ఉదయం స్వామి వారికి ఇమ్మడి మల్లయ్య ఇంటి నుంచి సందుబోనం, మహంకాళీ బోనం, నాగవెల్లి బోనాలను బైకాని కట్టయ్య, బొంతల రాజు, ఇమ్మడి సమ్మయ్య, ఒజ్జల సాంబయ్య, గొర్రె జంపయ్య, ఇమ్మడి భిక్షపతి, గొర్రె లచ్చిరావులు తీసుకెళ్లి సమర్పించారు. మధ్యాహ్నం ఒజ్జల లింగన్న ఇంటి నుంచి చల్లబాండువాను తీసుకెళ్లి సమర్పించారు. యాదవసంఘం కులపెద్దలు గొర్రె కొంరయ్య, సారిగొల్ల ఇమ్మడి భిక్షపతి, గోపు చంద్రమల్లు, ఎల్లావుల సమ్మయ్య, గుండెబోయిన కుమార్, కొనుపుల కుమార్, సంపత్, గోపు శ్రీను, ఇమ్మడి రాజు, రమేష్, బొల్ల రవి, ఒజ్జల లింగన్న, ఎల్లావుల అశోక్, ఒజ్జల కుమార్, ఒజ్జల కళ్యాణ్, బైకాని మధు, కావటి భాస్కర్, బోయిని రాజు, గొర్రె శ్రీను, రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్, ప్రస్తుత కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గంట రాంనారాయణగౌడ్ బీఆర్ఎస్ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేసినట్లు ప్రకటనలో తెలిపారు.

ఓటర్లకు ఇబ్బంది కలగొద్దు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దామోదర స్వామి



బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్

ఏటూరునాగారం : ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సిబ్బంది, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.. ఇందుకు కావాలిసిన వసతులు ఏర్పాటు చేసేందుకు పోలింగ్ కేంద్రాలను ఏటూరునాగారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి దామోదరస్వామి, కార్యదర్శి రమాదేవి పరిశీలించారు. మండలంలో 28 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా ఏటూరునాగారంలో 10 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిని పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు దామోదరస్వామి తెలిపారు.

వసతుల కల్పనపై దృష్టి

మండలంలో 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, అన్ని కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, ఫ్యాన్స్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం పనులు చేపట్టినట్లు తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. బుధవారం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎన్నికల రోజు ఓటర్లకు నీడ కోసం టెంట్లు, తాగునీటి వసతి, దివ్యాంగులకు ట్రై సైకిల్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ చీటిలను ఇప్పటికే బీఎల్‌ఓల ద్వారా పంపిణీ చేశామన్నారు. ఎవరైనా రాకపోతే పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు, ఇతర అధికారుల ఫోన్ నంబర్లు ఉంటాయని వాటికి ఫోన్ చేసి చీటిలు పొందాలన్నారు.



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న అధికారులు

బలరాం నాయక్‌ను గెలిపించాలి



గోవిందరావుపేట: ప్రచారంలో మహిళా నాయకులు



మంగపేట: పూరేడుపల్లిలో కాంగ్రెస్ నాయకులు

మంగపేట : మండలంలోని పూరేడుపల్లి, శనిగకుంట, నర్సింహసాగర్, గాంధీనగర్ తదితర గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ముఖ్య అతిథిగా ఇంటింటి ప్రచారం చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన ఆరుగ్యారంటీ కార్డులోని అంశాలను ఆయన వివరించారు. ప్రతీ ఒక్కరు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఏవిధంగా ఆదరించి అధికారంలోకి తీసుకువచ్చారో అదే రీతిలో ఆదరించాలన్నారు. దేశంలో అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తారని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ శేషగిరిరావు, మాజీ జెడ్పీటీసీ వైకుంఠం, మండవ రామకృష్ణ, జిల్లా నాయకులు తూడి భగవాన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గాదె శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడెల నరేష్, మండల నాయకులు గంగినేని శేషగిరి, అన్నాల వెంకన్న, శ్రీరాం రామ్మోహన్, ఎట్టి సారయ్య, పాయం అనిత, ఎండీ అజ్మత్, వాసంపెల్లి రజిత, ఎండీ జలాల్ తదితరులు పాల్గొన్నారు.

బొట్టు పెడుతూ.. ఇంటింటి ప్రచారం



ఏటూరునాగారం: మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న మనోజ్‌కుమార్

గోవిందరావుపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఇందులో భాగంగా చేతి గుర్తుకు ఓటు వేసి పోరిక బలరాం నాయక్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతి ఇంటింటికి తిరుగుతూ, గడప గడపకూ బొట్టు పెడుతూ బుధవారం ప్రచారం నిర్వహించారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ చేతిగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయాలని అందుకోసం అందరూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ జెట్టి సోమయ్య, సూదిరెడ్డి జయలక్ష్మి, మద్దాల నాగమణి, వజ్రమ్మ, అనిత, మని, మంగమ్మ మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : మానుకోట ఎంపీగా బలరాం నాయక్‌ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రబెల్లి మనోజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగా ప్యాకెట్లు అందించి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శివ, నాగరాజు, కిరణ్, రంజిత్, నర్సయ్య, గోపాల్, భాగ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం

కాటారం : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ యూత్ విభాగం రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్ అన్నారు. కాటారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పని ప్రదేశాలకు వెళ్లి కూలీలతో ముచ్చటించి ఓట్లు అభ్యర్థించారు. బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేద ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తి కొప్పుల ఈశ్వర్ అని ఆయనను గెలిపించుకుంటే ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో తన గొంతు వినిపిస్తారని పేర్కొన్నారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిళ్ల కిరణ్, జోడు శ్రీనివాస్, పంతకాని సద్భలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న రాకేశ్

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన కార్యకర్తలతో అశోక్



రాజుకు కండువా కప్పుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోవిందరావుపేట : మండలంలోని పస్రా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సుమారుగా 20 మంది నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీమండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్మి పార్టీలోకి వస్తున్న వివిధ పార్టీల నాయకులకు అందరికి అండగా సీతక్క ఉంటారని, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పని చేయాలని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయడమే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. కోమటిరెడ్డి సమ్మిరెడ్డి, ఎర్ర ధనమ్మ, అంజి నాయక్, బత్తుల సాంబయ్య, లకావత్ సేతియా, భీక్యా, వేణుగోపాల్, నారాయణ, చిలకమ్మ, వీరమ్మ, లక్ష్మి, రమణ, భూక్య భద్రు, సోను, వెంకన్న, లక్ష్మణ్ ఉన్నారు. గోవిందరావుపేట మండల, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం : బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, మండలంలోని ధన్వాడకు చెందిన భూపెల్లి రాజు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం మంథనిలో రాజుకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం అని భావించి కాంగ్రెస్‌లో చేరినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు తనవంతు కృషి చేస్తానని రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల విస్తృత ప్రచారం



గోవిందరావుపేట: దుంపెల్లిగూడెంలో ఓట్లు అడుగుతున్న నరసింహ నాయిక్

గోవిందరావుపేట : మండల పరిధిలోని దుంపెల్లి గూడెం, ప్రాజెక్ట్ నగర్ గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా నరసింహ నాయక్ దుంపెల్లిగూడెం గ్రామంలో రైతులను, హమాలీలను కలిసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రాజెక్ట్ నగర్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా లకావత్ నరసింహ నాయక్, సూడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే కరెంట్ కోతలు, తాగునీటి సమస్యలు తలెత్తయన్నారు.



ఏటూరునాగారం: చిన్నబోయినపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో రైతు బంధు, రుణమాఫీ, నిరంతరం విద్యుత్ ఇచ్చామని గుర్తు చేశారు. ఓటర్లంతా కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెట్ అభ్యర్థి మాలోత్ కవితను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీటీసీలు వెలిశాల స్వరూప, లావుడ్య రామచందర్, సూదిరెడ్డి లక్ష్మారెడ్డి, చందులాల్, గ్రామ కమిటీ అధ్యక్షులు వాసం శివాజీ, నర్సి రెడ్డి, ఐలయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్ల కుటుంబాలు

ఏటూరునాగారం : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ అన్నారు.బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేపట్టగా ఆటో డ్రైవర్ల అధ్యక్షుడు పెంచికల లక్ష్మీనారాయణ డ్రైవర్ల ఆవేదనను వెలిబుచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపకపోవడంతో తాము నష్టపోతున్నామని అన్నారు. ప్రతిరోజు ఆటో నడుపుకొని బతికే తమకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సునీల్ కోరారు. సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుజ్జేటి రాజశేఖర్, వావిలాల రాంబాబు, రాజు, ఫత్తె మహ్మద్, ఆడెపు వెంకటేష్, మాచర్ల శ్రీనివాస్, సతీష్, రామకృష్ణ, చిరంజీవి, మెట్టు రవి, ఠాగూర్, శివ, రతన్ సింగ్, జితేందర్ సింగ్, జగదీష్ పాల్గొన్నారు.

సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి

● మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్ కుమార్‌ని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందని, మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఇప్పటీ వరకు ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటితే కేంద్రంలో చక్రం తిప్పే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పతనవేని ఐలయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీ బందెల నరేష్, నాయకులు ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.